డిప్యూటీ కమిషనర్ ఆకస్మిక తనిఖీ



ఫాగింగ్ పనులను తనిఖీ చేస్తున్న డీసీ శ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: అల్వాల్ సర్కిల్ పరిధిలోని టెంపుల్ అల్వాల్, శ్రీసాయి కాలనీలో గురువారం దోమల నివారణకు చేస్తున్న ఫాగింగ్ కార్యకలాపాలను డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫాగింగ్ చేసిన ప్రతి కాలనీలో వారి సంతకాలు తీసుకోవాల్సిందిగా సూచించారు.సూపర్‌వైజర్ వేలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన ‘ప్రేమకు పరాకాష్ట’



నాటికలోని ఓ సన్నివేశం

మల్లాపూర్: రవి అండ్ రవి ఆర్ట్స్ అసోసియేషన్ 65వ వార్షికోత్సావాన్ని పురస్కరించుకొని రక్త కన్నీరు నాగభూషణం బళ్లారి రాఘవ బిరుదు గ్రహీత, దర్శకుడు మాడుగుల కృష్ణ మోహన్ రచించిన ప్రేమకు పరాకాష్ట సాంఘిక నాటికను మల్లాపూర్ అంబేడ్కర్ భవన్‌లో ప్రదర్శించారు. ఈ నాటిక పలు వురిని ఆలోచింపజేసింది. నటుడు కృష్ణమోహన్, నటిమణి మనుప్రియ, సహాయ నటులు రమేష్‌గౌడ్, సత్యనారాయణ, పూర్ణ చంద్రరావు, సాయి పవన్, ఫణీందర్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కాప్రా: భాగ్యనగర్ ఉత్సవ సమితి డాక్టర్ ఏఎస్‌రావునగర్ కన్వీనర్‌గా పర్కిబండ సందీప్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ఉప్పల్ కో కన్వీనర్ చల్లా ప్రభాకర్ సమక్షంలో ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ... గణేష్ ఉత్సవాలను కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధుల సమన్వయంతో ప్రశాంతవంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

మిగిలింది 11 ఎకరాలు! విస్తీర్ణం 27 ఎకరాలు..

ఇదీ రామంతాపూర్ చిన్న చెరువు దుస్థితి..

- గతంలో తాగునీరు సాగునీరు అందించిన చిన్న చెరువు
- ఒకవైపు కబ్జాలు, మరోవైపు అక్రమ నిర్మాణాలు
- కలుషిత నీరు, పాస్టిక్ వ్యర్థాలతో కాలుష్యకాసారంగా..
- చెరువును పరిరక్షించాలంటూ హైడ్రాకు వినతుల వెల్లువ



కబ్జాలతో కుంచించుకుపోయిన చిన్న చెరువు



చిన్న చెరువు గూగుల్ మ్యాప్

చెరువు బఫర్ జోన్ నిర్ధారణ చేయాలి



చిన్న చెరువులకు ఇంత వరకు ఖచ్చితమైన ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్‌ను అధికారులు నిర్ధారించలేదు. ఈ చెరువులో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించి కబ్జాదారులతో లాలూచిపడి ఎన్‌వోసీలు జారీ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి. చెరువు బఫర్ జోన్ ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలి.

– బాపట్ల కృష్ణమోహన్, సామాజిక కార్యకర్త

గంగపుత్రులు ఉపాధి కోల్పోయారు



గతంలో పరిశుభ్రమైన మంచి నీటితో చిన్న చెరువు జలకళ సంతరించుకుని ఉండేది. ఈ చెరువులో స్థానికంగా ఉండే వందలాది మంది గంగపుత్రులు చేపలు పెంచుతూ అవి పెరిగిన తరువాత విక్రయిస్తూ ఉపాధి పొందేవారు. చిన్న చెరువు కబ్జాలకు గురై కాలుష్యా కాసారంగా మారడంతో చేపలు కూడా చనిపోతున్నాయి. దీంతో చాలా మంది ఉపాధి కోల్పోయారు. ప్రభుత్వం ఈ అక్రమాలపై దృష్టి సారించాలి.

– కాపర్తి మోహన్ కృష్ణ, మేడ్చల్ జిల్లా మత్స్య సహకార సంఘం వైస్ చైర్మన్

రామంతాపూర్: రామంతాపూర్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీలో మధ్యలో ఉన్న చిన్న చెరువు గతంలో స్థానికులకు తాగునీరుతో పాటు పొలాలకు సాగునీరు అందిస్తూ స్థానికంగా గంగపుత్రులకు జీవనోపాధి కల్పించింది. గతంలో ప్రభుత్వ రికార్డులో 27 ఎకరాల విస్తీర్ణంగా ఉండే ఈ చెరువును కొంతమంది అధికారులు కబ్జాదారులతో కుమ్మక్కై 19.9 ఎకరాలుగా కుదించి రికార్డుల్లో చేర్చారని స్థానిక గంగపుత్ర సంఘం నేతలు ఆరోపిస్తున్నారు.

బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో సీసీ రోడ్డు

చిన్న చెరువు బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలో జీహెచ్ఎంసీ అధికారులు అవగాహన లేకుండా నిబంధనలకు వ్యతిరేకంగా సీసీ రోడ్డు వేశారు. కబ్జాదారులకు సౌకర్యంగా ఉండటానికి రోడ్డు వేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదే విధంగా ఈ రోడ్డుకు చివరన లక్షలాది రూపాయలు విలువ చేసే దాదాపు 300 గజాల చెరువు భూమిని అన్యాక్రాంతం చేసుకోవడానికి కొంత మంది పావులు కదుపుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ భూమికి వెంటనే ఫెన్సింగ్ వేసి కాపాడాలని వారు కోరుతున్నారు.

తప్పుడు ఎన్‌వోసీలతో నిర్మాణాలు

చిన్న చెరువు బఫర్‌జోన్ ఎఫ్‌టీఎల్ పరిధిలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల కక్కుర్తితో బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ కాదంటూ జారీ చేసి తప్పుడు ఎన్‌వోసీలతో బహుళ అంతస్తుల భవనాలు, భారీ షెడ్లు అక్రమంగా నిర్మించారు. ప్రస్తుతం ఈ చెరువులో అక్రమ నిర్మాణాలు, కబ్జాలతో పాటు చెరువులోకి డ్రైనేజీ నీరు, ప్లాస్టిక్ వ్యర్థాలు చేరడంతో కాలుష్యకాసారంగా మారింది.

చెరువు భూమిపై కేసులు...

చిన్న చెరువు శిఖం భూమి తమదేనంటూ స్థానికంగా ఉండే కొంతమంది న్యాయస్థానంలో కేసు కూడా వేశారు. అదే విధంగా ఈ భూమి తమదేనంటూ ప్రభుత్వ దేవాదాయ శాఖ ఏకంగా బోర్డులని ఈ భూమిలో పాతింది. హైడ్రాకు వెలువల చిన్న చెరువు కబ్జాపై ఫిర్యాదులు, చిన్న చెరువు బఫర్‌జోన్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న కబ్జాలను అక్రమ నిర్మాణాలను తొలగించి ఈ చెరువుపై న్యాయస్థానంలో ఉన్న కేసులను కూడా ఉపసంహరించుకునే విధంగా హైడ్రా కృషి చేసి చిన్న చెరువును పరిరక్షించాలని వందలాది మంది స్థానికులు ఫోన్, వాట్సాప్ మెసేజ్, టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఫిర్యాదులు చేస్తున్నట్లు సమాచారం. అదే విధంగా స్థానిక రామ్‌రెడ్డినగర్ నుంచి ఉప్పల్ వరకు విస్తరించి ఉన్న నాలా బఫర్ జోన్‌లోని కబ్జాలను కూడా తొలగించాలంటూ పలు ఫిర్యాదులు హైడ్రాకు అందుతున్నట్లు సమాచారం.

చెరువులు, నాలాలు ఆక్రమిస్తే ఫోన్ చేయండి

మీ ప్రాంతంలో ఎవరైనా వ్యక్తులు, సంస్థలు చెరువులు, పార్కు స్థలాలు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే వెంటనే 18005990099 టోల్ ఫ్రీ నెంబర్‌కు లేదా 040–29560508, 040–29560596 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని వ్యక్తిగతంగా కలిసి ఫిర్యాదు చేయాలంటే ముందుగా 7207923085 ఫోన్ నెంబర్‌కు మెసేజ్ చేసి అపాయింట్‌మెంట్ తీసుకోవాలని హైడ్రా అధికారులు సూచించారు. ఫిర్యాదు చేస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



ఉప్పల్ నల్ల చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

బస్తీ దవాఖానా తనిఖీ



బస్తీ దవాఖానాలో ఓపీ రికార్డును పరిశీలిస్తున్న శాంతి

మల్లాపూర్: నాచారం రైతు బజార్‌లోని బస్తీ దవాఖానాను నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ గురువారం తనిఖీ చేశారు. నిత్యం ఎంత మంది రోగులు వస్తున్నారనే విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఓపీ రికార్డులను పరిశీలించారు. డాక్టర్ లేకుండా స్టాఫ్ నర్సు ఒక్కరితోనే బస్తీ దవాఖానాను నడిపిస్తున్నారని, బీపీ మిషిన్ పనిచేయడం లేదని కార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఉన్నాతాధికారులకు డాక్టర్‌ను ఏర్పాటు చేయాలని కోరినా ఇప్పటికీ నియమించలేదన్నారు.

చదువులతో పాటు క్రీడలూ ముఖ్యమే

అల్వాల్: విద్యార్థులకు చదువులు ఎంతో ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని పల్లవి ప్రొగ్రెసివ్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ మాధవరెడ్డి, స్వర్ణలతలు అన్నారు. అల్వాల్‌లోని పల్లవి ప్రొగ్రెసివ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో గురువారం నేషనల్ స్పోర్ట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులు పలు ఆటల్లో పాల్గొని ప్రతిభ కనబర్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ పోలీసులు

అల్వాల్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు అన్నారు. అల్వాల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో గురువారం సుచిత్ర సర్కిల్, బొల్లారం జంక్షన్‌లో రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో 24 వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేసి కౌన్సెలింగ్ నిర్వహించారు. అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నరక ప్రయాణం!

అల్వాల్: నేరెడ్‌మెట్ రామకృష్ణాపురం బ్రిడ్జి మీదుగా వెళ్లే ప్రయాణికులు నిత్యం నరకం చూస్తున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం సమయంలో గంటల కొద్దీ బ్రిడ్జి మీదనే ట్రాఫిక్ జాం అవుతుండటంతో గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి దాపురించిందని వాపోతున్నారు. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా బ్రిడ్జిని విస్తరించాలన్న ప్రతిపాదనలు సంవత్సరాలుగా పెండింగ్‌లోనే ఉంటున్నాయని, రద్దీ సమయంలోనైనా అధికారులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకుంటే ప్రయాణికులకు అవస్థలు తగ్గుతాయని ప్రయాణికులు కోరుతున్నారు. పొద్దంతా ఉద్యోగాలు, వ్యాపారాలు చేసి ఇంటి ముఖం పట్టిన సమయాల్లో ఈ రహదారి నిత్యం అవస్థలు తెచ్చిపెడుతుందని ట్రాఫిక్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరతున్నారు.

ఫ్రీ పార్కింగ్ కొనసాగించాలి

ఉప్పల్: నాగోల్, మియాపూర్ మెట్రో స్టేషన్లల్లో ఫ్రీ పార్కింగ్‌ను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, పీవైఎల్ యువజన సంఘాల ఆధ్వర్యంలో నాగోల్ మెట్రోస్టేషన్ వద్ద ప్రయాణికులతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యవజన సంఘాల ప్రతినిధులు కల్లూరు ధర్మేంద్ర, సత్యప్రసాద్, వెంకటేష్, కె.ఎస్.ప్రదీప్ మాట్లాడుతూ... మెట్రో ప్రయాణికులకు పార్కింగ్ సౌకర్యాన్ని ఉచితంగా కల్పించాల్సిన బాధ్యత మెట్రో సంస్థదే అన్నారు. ప్రభుత్వ భూములను ఉచితంగా తీసుకుని వాటిల్లో ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా చార్జీల పేరుతో దండుకోవాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. కేవలం నాగోల్, మియాపూర్ స్టేషన్లతో పాటు మిగిలిన అన్ని స్థలాల్లో పార్కింగ్ ఫీజును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం మియాపూర్ మెట్రో స్టేషన్ వద్ద కూడా సంతకాల సేకరణ పూర్తయిన తరువాత మెట్రో ఎండీకి వినతి పత్రంతో పాటు ప్రయాణికుల నుంచి సేకరించిన సంతకాల పత్రాలను సమర్పిస్తామని తెలిపారు. అప్పటికీ సమస్య పరిష్కరించకుంటే చలో నాగోల్ పేరిట ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో శేఖర్, గిరిబాబు, రాజ్‌కుమార్, రవి, మాజీద్ అలి ఖాన్, కళ్యాణ్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘అధికారుల తీరుపై న్యాయపోరాటం చేస్తాం’

కుషాయిగూడ: కనీస సమాచారం లేకుండా సొంత స్థలంలోని కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేయడం దారుణమని ములుగు రుక్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కుషాయిగూడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాప్రా మండల పరిధిలో తమకు సంబంధించిన భూముల్లో 507 ఎకరాల స్థలాన్ని 1996లో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎన్ఎఫ్‌సీకి విక్రయించామని, అందులో 108 ఎకరాలు ఎన్ఎఫ్‌సీ తిరిగి అప్పగించింద తెలిపారు. నాటి నుంచి ఆ స్థలం తమ ఆధీనంలోనే ఉందని చెప్పారు. ఈ భూమిపై తమకు పూర్తి హక్కులు ఉన్నా రెవెన్యూ అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తమ స్థలంలో నిర్మించిన కట్టడాలు కూలివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాప్రా మండల రెవెన్యూ అధికారుల తీరుపై న్యాయపోరాటం చేస్తామని వెల్లడించారు.

గణేష్ మండప నిర్వాహకులతో సమీక్ష

మేడిపల్లి: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో తీసుకోవాల్సిన చర్యలపై గణేష్ మండపాల నిర్వాహకులు ఉత్సవ కమిటీలతో మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ గోవింద రెడ్డి గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి మాట్లాడుతూ... వైభవంగా నిర్వహించే గణేష్ ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీక అని అన్నారు. ఈ సందర్భంగా గతేడాది జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారితో చర్చించారు. ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

అక్రమ షట్టర్ల నిర్మాణాలను ఆపాలి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

బోడుప్పల్: చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల ఆవరణంలో అక్రమంగా నిర్మిస్తున్న షట్టర్లను ఆపాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం కమిషనర్ రామలింగం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీపీఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చకిషన్ మాట్లాడుతూ... చెంగిచర్ల ప్రధాన రహదారిలో ఉన్న విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల ఆవరణంలో స్కూల్ వాతావరణం దెబ్బతినే విధంగా షట్టర్లను నిర్మిస్తున్నారన్నారు. మాస్టర్‌ప్లాన్‌లో 100 అడుగుల రోడ్డు ఉండగా, దానికి విరుద్ధగా నిర్మిస్తున్నారన్నారు. నగర పాలక సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా 11 షట్టర్లు నిర్మిస్తున్నారని, వాటిని వెంటనే ఆపాలన్నారు. నిర్మాణాలు ఆపని ఎడల జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. ఈకార్యక్రమంలో మేడిపల్లి మండల మహిళా సమాఖ్య కార్యదర్శి సిహెచ్ మాధవి, మహాలక్ష్మి, భూతం ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లి ఎస్‌హెచ్‌ఓగా రవికుమార్



కుషాయిగూడ: చర్లపల్లి పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా బి. రవికుమార్ నియమితులయ్యారు. యాదాద్రి వన్‌టౌన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన రవికుమార్ బదిలీపై చర్లపల్లి పీఎస్‌కు వచ్చారు. ఇప్పటి వరకు ఆ స్థానంలో విధులు నిర్వహించిన రవీందర్‌ను సీసీఎస్‌కు అటాచ్ చేశారు పోలీసు ఉన్నతాధికారులు. ఆయన స్థానంలో యాదాద్రి నుంచి వచ్చిన రవికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు.

కబ్జాను అడ్డుకున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులను సముదాయిస్తున్న తుకారాంగేట్ పోలీసులు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ మహేంద్రహిల్స్‌లోని సర్వే నెంబర్–844/1 ప్రభుత్వ స్థలంలో ప్రజలకు తాగునీరు అందించడానికి 3500 గజాల స్థలాన్ని ట్యాంక్ నిర్మాణం కోసం అధికారులు కేటాయించారు. ఈ స్థలాన్ని కొందరు భూకబ్జాదారులు తప్పుడు పత్రాలు సృష్టించి గురువారం స్థలం వద్ద జేసీబీ సహాయంతో చదును చేయడానికి వచ్చారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు వేర్వేరుగా ఘటనా స్థలానికి చేరుకొని భూకబ్జాదారులను అడ్డుకున్నారు. ఈ స్థలం ఎట్టి పరిస్థితుల్లో ప్రజలకు నీటిని అందించడానికి ఉపయోగపడేదని, భూకబ్జాదారులకు ఎవరైనా సహకారం చేసినా సహించేది లేదన్నారు. అనంతరం జలమండలి అధికారుల ఫిర్యాదు మేరకు తుకారాంగేట్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఎలాంటి ఘర్షణలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

క్రీడల్లోనూ రాణించాలి



కబడ్డీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బోడుప్పల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన ఇంటర్ స్కూల్స్ కాంపిటేషన్స్ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జాతీయ స్పోర్ట్ డే పురష్కరించుకుని చెంగిచర్లలో విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల, సెయింట్ పాల్స్, శ్రీవిద్యాజ్యోతి హైస్కూల్ ఈపోటీల్లో పాల్గొన్నట్లు వెల్లడించారు. కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా, ఖోఖో పోటీల్లో సెయింట్ పాల్స్ స్కూల్ ప్రథమ స్థానంలో నిలచింది. కార్యక్రమంలో విద్యాజ్యోతి పాఠశాల డైరెక్టర్ అనిల్ అయ్యంగార్, ప్రిన్సిపాల్ నీలిమా, సెయింట్ పాల్స్ స్కూల్ కో ఆర్డినేటర్ రవీంద్ర నాయక్, శ్రీవిద్యా జ్యోతి పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ఉషాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

140 నిర్మాణాలకు నోటీసులు జారీ

అల్వాల్: చెరువులు, కుంటలు పరివాహక ప్రాంతాలలో నిర్మించిన కట్టడాలపై అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. ఇంతకుముందు ఎన్నడూ లేని విధంగా క్షేత్రస్థాయిలో వెళ్లి ప్రతి ఇంటికి గతంలోని చెరువు మ్యాపులతో సరిపోల్చుతూ అక్రమాలని తేలితే వెంటనే నోటీసులు జారీ చేస్తున్నారు. ఈ సందర్భంగా అల్వాల్ మండల తహసీల్దార్ రాములు మాట్లాడుతూ అల్వాల్ మండల పరిధిలోని ఒక్క చెరువు ప్రాంతంలోనే వందకు పైగా నిర్మాణాలకు నోటీసులు జారీ చేశామని అంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుందన్నారు. అల్వాల్‌లోని చిన్న రాయుని చెరువు చుట్టూ నిర్మించిన కట్టడాలలో 140 నిర్మాణాలకు నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఇవేకాకుండా కొత్త చెరువు, మోత్కులకుంట చెరువు, కొకూర్, యాప్రాల్‌లోని చెరువులలో నిర్మించిన కట్టడాలపై కూడా పరిశీలన జరుగుతుందన్నారు. దీంతో మండల పరిధిలోని వందల కొద్ది అక్రమ నిర్మాణాలు గుర్తించినట్లు తెలిపారు.

యువకులకు రిమాండ్

మేడిపల్లి: పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన నలుగురు యువకులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బోడుప్పల్ హేమానగర్ కాలనీలో నివాసముంటున్న బిట్టుకుమార్ యాదవ్ (24), రాజ్‌కుమార్(22), విక్రమ్ యాదవ్(22), నందన్‌కుమార్ (25)లు కలిసి పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు మద్యం సేవిస్తూ కనిపించడంతోపాటు దురుసుగా ప్రవర్తించారు. నలుగురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

ఉప్పల్: రాచకొండ డీసీపీ క్రైం అరవింద్ బాబు ఆధ్వర్యంలో గురువారం ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డిలతో కలసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉప్పల్ మెట్రోస్టేషన్, ఉప్పల్ బస్ స్టాప్, మెట్రో మాల్, ఉప్పల్ స్కైవాక్ తదతర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. అనుమానితుల వివరాలను ఆరా తీశారు. జన సంచార ప్రాంతాల్లో అనుమానితులు ఎవరైనా తచ్చాడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాల్సింది వారు కోరారు.

తెలుగు భాష వైతాళికుడు గిడుగు రామ్మూర్తి

వాడవాడలా రామ్మూర్తి జయంతి ◆ ఆయన చిత్రపటాలకు ఘనంగా నివాళి

తెలుగు వ్యవహారిక భాష వైతాళికుడు గిడుగు రామ్మూర్తి జయంతిని ఉప్పల్, మల్కాజిగిరి నియోజకవర్గాల పరిధిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... పరభాష వ్యామోహం.. ఆ భాషపట్ల ప్రేమ ఉండటంలో తప్పులేదని... అయితే మాతృభాషను సంరక్షించుకోవాల్సిన అవసరం ఏంతైనా ఉందన్నారు. మాతృభాషపై పట్టుసాధిస్తే అన్ని భాషల్లోనూ రాణించే అవకాశం ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. తెలుగు భాషను వ్యవహారిక భాషలో తీర్చిదిద్దడంలో గిడుగు రాంమూర్తి పాత్ర అమోఘమని కొనియాడారు. తెలుగు భాష ఎంతో పురాతనమైందని, ప్రజలు తమ జీవన నేపథ్యంలో సంస్కృతిపరంగా అభివృద్ధి పరిచారని తెలిపారు.

– ఉప్పల్, మల్కాజిగిరి జోన్ బృందం



వైష్ణవి ఒలంపియాడ్ స్కూల్‌లో...



ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో ప్రముఖ కవి యాకూబ్ తదితరులు



అమ్మ పాఠశాలలో...



నాచారం అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో...



తాళపత్ర గంథాలతో విద్యార్థులు



వందేమాతరం శ్లోకం చదువుతున్న విద్యార్థులు



నివాళులర్పిస్తున్న స్ఫూర్తి గ్రూప్ ప్రతినిధులు